సమావేశంలో పాల్గొన్న ఎంపీలు రంగయ్య, మాధవ్, కలెక్టర్ గౌతమి

ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు

కొత్త నిధులకు ప్రతిపాదనలు పంపడి సమీక్షా సమావేశంలో ఎంపీలు, కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎంపీ నిధుల కింద చేపట్టిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, కలెక్టర్ ఎమ్.గౌతమి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్సు హాల్లో ఎంపీ నిధులపై సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం పార్లమెంటరీ నియోజకవర్గంలో రూ.14.49 కోట్ల విలువతో మజూరు అయిన 121 పనులకు గాను 48 పనులు మాత్రమే పూర్తి అయ్యాయన్నారు. 58 పనులు పురోగతిలో ఉన్నవని మిగిలిన,15 పనులు ఇంకా మొదలు కాలేదన్నారు .అందరు ఏజెన్సీలు ప్రగతిలో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని,ఇంకా మొదలుకాని పనులను వెంటనే మొదలు పెట్టాలని ఆదేశించారు. హిందూపురం పార్లమెంటరీ నిధులకు సంబంధించి రూ.4.55 కోట్ల విలువతో మంజూరు అయిన 88 పనులకు గాను 48 పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. 23 పనులు పురోగతిలో ఉన్నాయని, ఇంకా 9 పనులు మొదలు కాలేదన్నారు. ఈ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతపురం ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ ఇదివరకే ప్రతిపాదించిన శ్మశాన, భవన నిర్మాణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ ఎంపీ నిధుల కింద చేపట్టిన అన్ని పనులును యుద్ధ ప్రాతిపదికను పూర్తిచేయాలని ఏజెన్సీలను కోరారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై కదలిక

ఈనెల 30న పంపిణీ - జాబితాలు సిద్ధం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం రైతు భరోసాపై ప్రకటన చేసింది. ఈనెల 30వ తేదీన రైతు భరోసా కింద రూ.7500 ఒక్కో రైతు ఖాతాకు జమ చేయనుంది. ఈ మేరకు ప్రకటన వెలువడింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని కర్నూలు జిల్లాలో ప్రారంభించనున్నారు. ఇక్కడ జిల్లాలో మంత్రి ఉషశ్రీచరణ్ ప్రారంభించనున్నారు. జిల్లాలో ఎక్కడ ప్రారంభిస్తారన్నది ఇంకా నిర్ణయించాల్సి ఉంటుంది.

కాస్త ఊరట

మే నెలలో వర్షాలొస్తుండటంతో రైతులు దుక్కులు దున్ని భూములను సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాల పంపిణీకి ప్రభుత్వం రిజిస్ట్రేషన్లను ప్రారంభించింది. అయితే చేతిలో చిల్లిగవ్వలేకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు కూడా కొనలేక అవస్థలు పడుతున్నారు. మే నెలలో ప్రతి ఏటా ఇచ్చే రైతు భరోసాపైనా ప్రకటనలేకుండా ఉంది. ఇటువంటి సమయంలో శుక్రవారం నాడు ప్రభుత్వం రైతు భరోసా ఈనెల 30వ తేదీన ఇవ్వడానికి సిద్ధపడినట్లు ప్రకటన రావడంతో రైతులకు కాస్త ఊరట లభించినట్లు అయ్యింది. మొదటి విడత కింద ఇచ్చే రూ.7500 ఒక్కో రైతుకు ఇవ్వనున్నారు. దీంతో విత్తనాలు, దుక్కుల వరకైనా కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

అందనున్న రూ.158 కోట్లు

అనంతపురం జిల్లా వరకు చూస్తే 2,87,479 మంది రైతులు రైతు భరోసా కింద అర్హులుగానున్నారు. వీరందరికీ కలిపి మొత్తం రూ.158.74 కోట్లు రైతు భరోసా కింద జిల్లాకు రానున్నాయి. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా లబ్ధిదారుల జాబితాలు సైతం సిద్ధం చేసియున్నారు. నియోజకవర్గాల వారీగా సైతం జాబితాలు సిద్ధంగానున్నాయి. గుంతకల్లు నియోజకవర్గం పరిధిలో మొత్తం 29381 మంద రైతులు ఉన్నారు. వీరికి రూ.16.15 కోట్లు. కళ్యాణదుర్గం నియోజకవర్గం పరిధిలో 53896 మంది రైతులకు రూ.29.64, రాప్తాడు నియోజకవర్గం పరిధిలో 24141 మంది రైతులకు రూ.13.27 కోట్లు, రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో రూ.44655 మంది రైతులకు రూ.24.56 కోట్లు, శింగనమల నియోజకవర్గం పరిధిలో 53635 మంది రైతులకు రూ.29.49 కోట్లు, తాడిపత్రి నియోజకవర్గం పరిధిలో 31923 మంది రైతులకు రూ.17.55 కోట్లు, ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో 49848 మంది రైతులకు రూ.27.41 కోట్లు రైతు భరోసా కింద రైతులకు సహాయం అందనుంది.

నష్టపరిహారం కూడా అందితే...

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వరుసగా పడుతున్న వర్షాల, గాలుల వల్ల రైతులు పంటలు నష్టపోయి ఉన్నారు. ప్రకృతి వైపరిత్యాలతో దెబ్బతిన్న రైతులకు ఇంకా పరిహారం అందలేదు. ఈ పరిహారం కూడా సీజన్ ప్రారంభంలోపు అందితే రైతులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. దీనిపై ఇంకా ప్రభుత్వం వైపు నుంచి అధికారిక ప్రకటనేదీ వెలువడలేదు. ఇది కూడా ఇవ్వాలని నష్టపోయిన రైతులు కోరుతున్నారు.

37,982 భూహక్కు పత్రాలు సిద్ధం

ఆర్‌బికెల్లో 16,910 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తనం

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష రీ సర్వే పథకం కింద జిల్లాకు 37,982 భూహక్కు పత్రాలు అన్ని వివరాలు పూర్తి చేసి సిద్ధంగా ఉన్నాయని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో రీసర్వే, అగ్రికల్చర్, సివిల్ సప్లైస్ అంశాలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కింద కళ్యాణదుర్గం డివిజన్లో మొదటి దశలో వందశాతం రీ సర్వేను పూర్తి అయ్యిందన్నారు. 43 గ్రామాల్లో సర్వేరాళ్లను కూడా పాతారన్నారు. 43 గ్రామాలకు సంబంధించి జిల్లాకు 37,982 భూహక్కు పత్రాలు అందాయన్నారు. వెబ్ ల్యాండ్-1 నుంచి వెబ్ ల్యాండ్ -2 కొత్త పోర్టల్ మాడ్యూల్ వచ్చిందని, కరెక్షన్ ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. రెండవ దశలో అనంతపురం, గుంతకల్ డివిజన్లలో రీసర్వే ప్రారంభిస్తామన్నారు. జూన్ 1 నుంచి బియ్యం కార్డుదారులకు ఒకటి నుంచి మూడు కేజీల వరకు ఉచితంగా రాగుల పంపిణీ చేస్తామన్నారు. తొలుత మునిసిపాల్టీలు, నియోజకవర్గ కేంద్రాల్లో ప్రారంభించి అనంతరం రెవెన్యూ గ్రామాల్లో పంపిణీ చేస్తామన్నారు. ఈనెల 30వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద రైతుల బ్యాంకుల ఖాతాల్లో మొదటి విడత సొమ్మును జమ చేస్తుందని తెలిపారు. 253 రైతు భరోసా కేంద్రాల్లో కే6, 1812 కదిరి లేపాక్షి రకాలు మొత్తంగా కలిపి 16,910 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీకి సిద్ధంగా ఉంచామన్నారు. విత్తనాల కోసం 35 వేల మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 30 వేల క్వింటాళ్ల వరకు వేరుశనగ విత్తనాన్ని అందుబాటులో ఉంచామన్నారు. ఈనెల 29వ తేదీన కళ్యాణదుర్గం డివిజన్ పాలవాయి గ్రామంలో మంత్రి ఉషశ్రీచరణ్ చేతుల మీదుగా విత్తన పంపిణీని ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషోర్ బాబు పాల్గొన్నారు.

2న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉరవకొండ మహాత్మా డిగ్రీ కళాశాలలో జూన్ 2వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎమ్.గౌతమి తెలిపారు. జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్‌మేళాలో సుమారు 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. 10, ఇంటర్, డిప్లొమా, ఐఐటి, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చని సూచించారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైనా వారికి రూ.10 నుంచి రూ.30వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఉరవకొండ మహాత్మా డిగ్రీ కళాశాలలో జూన్ 2వ తేదీ జరిగే జాబ్‌మేళాలకు నిరుద్యోగులు వారి అన్ని ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9010039901, 8096763970, 8317520929 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చున్నారు.

ట్రాఫిక్ పోలీస్‌కు ఎసి హెల్మెట్ పెడుతున్న డిఐజి అమ్మిరెడ్డి, చిత్రంలో ఎస్పీ కె.శ్రీనివాసరాలు

ట్రాఫిక్ పోలీసులకు ఎసి హెల్మెట్లు పంపిణీ

అనంతపురం క్రైం : నగరంలోని ట్రాఫిక్ పోలీసులకు ప్రయోగాత్మకంగా ఎసి హెల్మెట్లు పంపిణీ చేసినట్లు అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి, ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని టవర్‌క్లాక్ వద్ద ట్రాఫిక్ విధుల్లో ఉన్న సిబ్బందికి శుక్రవారం హెల్మెట్లు అందజేసి ఎంత వరకూ ప్రయోజనకరంగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమమే పరమావధిగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విధుల్లో ఆటంకం లేకుండా అనువుగా ఉంటే వాటి పని తీరును బట్టి మరిన్ని ఎసి హెల్మెట్ల పంపిణీకి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, ఎ.హనుమంతు (ఎ.ఆర్), అనంతపురం డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు (ఎ.ఆర్), ట్రాఫిక్ సిఐ వెంకటేష్‌నాయక్, టూటౌన్ సిఐ శివరాముడు, ఆర్ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.6.21కోట్లతో మురుగు కాలువల నిర్మాణం

మేయర్ మహమ్మద్ వసీం

అనంతపురం కార్పొరేషన్ : నగరంలో రూ.6.21కోట్ల వ్యయంతో మురుగు కాలువల నిర్మాణాలు సాగుతున్నాయని మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. శుక్రవారం నగరంలోని 26వ డివిజన్ పరిధిలో 15వ ఆర్థిక నిధులతో రూ.20 లక్షలతో చేపడుతున్న మురుగు కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా పనుల పురోగతిని అడిగి తెలుసుకుని త్వరితగతిన నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారుల అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా డ్రైనేజీలు కల్వర్టులను అవసరమైన ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేస్తూ పారిశుద్ధ్య మెరుగునకు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. నగరంలోని అన్ని డివిజన్ లలో 15 వ ఆర్థిక నిధులతోపాటు, గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయం కు విడుదలైన రూ.20 లక్షల నిధులను వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. సిఎం జగన్ సహకారంలో తమ పాలకవర్గ హయాంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో నగర అభివృద్ధి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్ భూషణ్, డిఇ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐను బలోపేతం చేయండి

- ఆసుపత్రులను 30పడకల స్థాయికి పెంచాలి
- అర్హులైన కార్మికులందరికీ ఈఎస్ఐ వర్తింపజేయాలి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

అనంతపురం ఇఎస్ఐ ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పేద కార్మికుల వైద్యానికి ఎంతో ఆసరగా ఉంటున్న ఈఎస్ఐ ఆసుపత్రులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడి వీటిని మరింత బలోపేతం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. ఈఎస్ఐ స్కీంను బలోపేతం చేసి, కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం నాడు అనంతపురంలో నిరసన చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి శ్రీకంఠం సర్కిల్ మీదుగా ఈఎస్ఐ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈఎస్ఐ కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ సమాజాభివద్ధిలో కీలకంగా ఉన్న కార్మికవర్గం ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రులను కేంద్రం పట్టించుకోవడం లేదు. దీంతో కార్మికులకు అక్కడ ఏవిధమైన వైద్యసేవలూ అందడం లేదన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా జిల్లా కేంద్రాల్లో ఈఎస్ఐ ఆసుపత్రుల్లో 30 పడకలను అందుబాటులో ఉంచాలన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులనూ ఏర్పాటు చేయాలన్నారు. డిస్పెన్సరీలు, డాక్టర్లు, సిబ్బంది, పరికరాలు, మందులు తగినంత స్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. రెఫరల్ ఆసుపత్రుల్లో చందాదారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని వైద్యసేవలూ అందజేయాలని డిమాండ్ చేశారు. 10 మంది కార్మికులు లోపల ఉన్న సంస్థల్లో కూడా ఇఎస్ఐ పథకాన్ని వర్తింజేయాలన్నారు. రూ.21 వేల వేతన పరిమితి దాటిన కార్మికులను ఇఎస్ఐ పథకం నుంచి తొలగించే నిబంధనను తక్షణం రద్దు చేయాలన్నారు. ఇపిఎఫ్ పథకంలో మాదిరే రూ.15 వేల వరకు వేతనం ప్రకారం ఇఎస్ఐ పథకానికీ వర్తింప చేయాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వేలాది మంది కార్మికులు ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పనిచేస్తున్న వారందరికీ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వం స్పందించి కార్మిక సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈఎస్ఐ అధికారి మోహన్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వై.వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, తిరుమలేష్, సత్యసాయి శ్రీరామరెడ్డి వాటర్స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, రాము, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

పంటనష్టపరిహారాన్ని ప్రకటించాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతన్న ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

గతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు సాగు చేసిన నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారాన్ని ప్రకటించాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని రైతుసంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న అతివృష్టి, అనావృష్టి వల్ల ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన వేరుశనగ, పత్తి, కంది, ఇతర పంటలు పొలాల్లోనే కుళ్లిపోయాయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. 2.5 లక్షల హెక్టార్లలో వేరుశనగ, 70 వేల హెక్టార్లలో పత్తి, పండ్ల తోటలు దెబ్బతిన్నాయన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఇంత వరకూ నష్టపరిహారం ప్రకటించిన పాపానపోలేదన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో జిల్లాలో సాగు చేసుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోవైపు ఖరీఫ్ ప్రారంభానికి ముందు రైతు భరోసా మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇంత వరకూ ఇవ్వలేదన్నారు. కావున వెంటనే ప్రభుత్వం స్పందించి గతేడాది పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారంతోపాటు రైతు భరోసా సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎపి రైతుసంఘం తాడిపత్రి మండల కార్యదర్శి రాజారామిరెడ్డి పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

విధులపై అధికారులకు నిర్లక్ష్యం తగదు

టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

టౌన్ ప్లానింగ్ సమావేశంపై ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికి మీటింగ్‌కు వివరాలతో రాకుంటే ఎలా అని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బందిపై తీవ్ర కమిషనర్ రమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తన ఛంబర్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది అసమర్థ నిర్లక్ష్య ధోరణిపై విస్మయం వ్యక్తం చేశారు. ఎన్ని మాటలు చెప్పినా పద్ధతులు మార్చుకోకుండా వ్యవహరించటం నిర్లక్ష్యం తెలుస్తోందన్నారు. ఎన్ని అక్రమ కట్టడాలపై ఛార్జ్‌షీట్‌లు ఫైల్ చేశారని, ఎన్ని పెండింగ్ ఉన్నాయని, ఎంత షార్ట్‌ఫాల్ అమౌంట్ కట్టించాల్సి ఉంది, ఎంత కట్టించారు, ఇన్-ప్రిన్సిపల్ లేఔట్ అప్రూవల్ ఎన్ని ఇచ్చారు.. ఎన్ని రిజెక్ట్ చేశారు, రీసర్వేపై తదితర పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని ప్రత్యేకించి చెప్పినా ఏ ఒక్కరూ తీసుకు రాకుంటే ఎలా అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కౌన్సిల్ సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపైనా, అడిగిన ప్రశ్నలపై ఎంతవరకూ సమాచారం అందించారని ఆరా తీస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడం, అంతేకాక సిబ్బంది యొక్క నిర్లక్ష్యానికి కమిషనర్ కోర్టుల చుట్టూ తిరగాల్సిన పని కల్పిస్తున్నారని, ఏదన్నా జరిగితే కమిషనర్ సమాధానం చెప్పుకుంటాడు లే అన్న ధోరణి సరైనది కాదన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. మరోవారం తర్వాత ఇదే విషయాలపైనా సమావేశం నిర్వహిస్తానని, అప్పటికి ఎటువంటి మార్పు కనిపించకపోయినా, అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎసిపి సువర్ణ, టిపిఎస్ మహబూబ్ జాన్, టిపిబిఓలు దుర్గాంజలి, మురళి కృష్ణ, విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు పెద్దన్న శుక్రవారం సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని గూగూడు రెవెన్యూ పొలంలో సర్వేనెంబర్ 58/3లో పెద్దన్నకు ఐదెకరాల పొలం ఉంది. తన భూమి సమస్యను పరిష్కరించాలని రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. అయినా పరిష్కరించలేదు. ఇందులో భాగంగానే శుక్రవారం కూడా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్‌కు సమస్య విన్నవించాడు. అయినా పట్టించుకోకపోవడంతో మనస్థాపం చెంది తన వెంట తెచ్చుకున్న సూపర్ వాస్మోల్‌ను తాగాడు. గమనించిన చుట్టు పక్కల వారు వెంటనే నార్పల ప్రాథమిక కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి 108 ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పెద్దన్న కుమారుడు నరేష్ మాట్లాడుతూ భూ సమస్య పరిష్కరించాలని తహశీల్దార్ నారాయణస్వామిని కోరడంతో నీకు దిక్కున చోట చెప్పుకోపో చేసేది లేదు అనడంతోనే ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు వాపోయాడు. తమ నాన్నకు ఏమైనా జరిగితే రెవెన్యూ అధికారులదే బాధ్యత అని వాపోయాడు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరాడు.



పెద్దన్నను ఆసుపత్రికి తరలిస్తున్న బంధువులు

కాగా నార్పల మండలంలో గతంలో కూడా రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా పాస్ పుస్తకాలు జారీ చేశారని ఆరోపణలు ఉన్నాయి. గత పది సంవత్సరాలుగా మండలంలో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ఎక్కడా భూ పంపిణీ జరగలేదు. అయినా నార్పల మండలంలో ఇష్టానుసారంగా అధికారులు పాసుపుస్తకాలు జారీ చేశారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రూప్స్ పుస్తకాలను అందుబాటులో ఉంచాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో త్వరలో నోటిఫికేషన్ విడుదల కానున్న గ్రూప్-1, 2కు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని డివైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని గ్రంథాలయంలో అసిస్టెంట్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూపు1, 2 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. త్వరలో నోటిఫికేషన్ కూడా విడుదల కానున్నట్లు తెలిపారు. ఇలాంటి సందర్భంలో గ్రంథాలయాల్లో గ్రూప్స్‌కు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచితే విద్యార్థులు, నిరుద్యోగులకు ఎంతో మేలు చేసినవారు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు, పట్టణ కార్యదర్శి శివ, శంకర, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అసిస్టెంట్ అధికారిణికి వినతిపత్రం సమర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రశాంత వాతావరణం నెలకొల్పాం : ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంతోపాటు తాడిపత్రి నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. ప్రజా సంక్షేమ పాదయాత్ర శుక్రవారం మండల పరిధిలోని వెంకటరెడ్డిపల్లి వద్ద ప్రారంభమై పొలమడ, నందలపాడు, శ్రీనివాసపురం మీదుగా తాడిపత్రిలోని వైసిపి కార్యాలయానికి చేరుకుంది. పాదయాత్రకు ఎంపీ తెల్లారి రంగయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల వ్యక్తిగత సమస్యలతోపాటు గ్రామాల్లోని సమస్యలు, సంక్షేమ పథకాలు లోపాలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. నాలుగేళ్లుగా తాడిపత్రి నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణ నెలకొల్పడం గర్వంగా ఉందన్నారు. మరోవైపు పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాలకు సాగు, తాగునీరు అందించి సస్యశ్యామలం చేశామన్నారు.

పాదయాత్రలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

సమగ్ర సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-రాయదుర్గం

జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష కార్యక్రమంలో భాగంగా ఆధునిక డ్రోన్ పద్ధతిలో ఏర్పాటు చేసిన రీసర్వే కార్యక్రమాన్ని విప్ కాపు రామచంద్రారెడ్డి శుక్రవారం రాయదుర్గంలో ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక పద్ధతిని ఉపయోగించి డ్రోన్ ద్వారా నేటి నుంచి జూన్ 9వ తేదీ వరకు రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో ఉన్న నివాస గృహ స్థలాలు, వ్యవసాయ, ప్రభుత్వ, ప్రయివేటు భూములను సర్వే చేయనున్నట్లు కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, వలిబాషా, వార్డు సభ్యులు గోవిందరాజులు, వన్నూరప్ప, డిష్ గోవిందా, పట్టణ ప్రణాళిక విభాగం టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మారుతీప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ రఘు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని అరకటవేములలో శుక్రవారం ప్రారంభించారు. రీసర్వేను ఆర్‌డిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పకడ్బందీగా రీసర్వే చేపట్టాలన్నారు. ఎలాంటి అవకతవకలు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుమతి, డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్, మండలంలో అన్ని గ్రామాల గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడు..

కాలవకు విప్ కాపు రామచంద్రారెడ్డి హితవు

ప్రజాశక్తి-రాయదుర్గం

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ప్రభుత్వ భూములు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టిన కబ్జాదారులకు మద్దతుగా కాకుండా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని విప్ కాపు రామ చంద్రారెడ్డి హితవు పలికారు. శుక్రవారం పట్టణంలోని రోడ్లు, భవ నాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ గత గురువారం తాను బొమ్మనహాల్ మండలం దర్గాహొన్నూరులోని మాల్యం-రూపనగుడి ప్రధాన రహదారిపై రఫీ అనే వ్యక్తి గ్రామకంఠం భూమిని కబ్జా చేసి 16 మందికి విక్రయించాడన్నారు. అంతేకాక అతడు ఆక్రమించిన స్థలంలో నివాసం ఏర్పాటు చేసుకుని ప్రధాన మురికి కాలువపై షెడ్డు ఏర్పాటు చేసుకుని హోటల్ పెట్టారన్నారు. దీంతో వాహనాలు రోడ్డుపైనే నిలబెట్టడంతో హొన్నూరుస్వామి దర్గాకు వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించానన్నారు. అయితే టిడిపి మద్దతుదారుడైన కబ్జాదారుడు రఫీని కాలవ శ్రీనివాసులు వెనుకేసుకురావడం బాధాకరమన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

కాలవ శ్రీనివాసులు ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, మున్సిపల్ వార్డు సభ్యులు శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు సత్యనారాయణరెడ్డి, దివాకర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

సిఎం జగన్ అమరావతిలో 51 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తే సమాధులతో పోల్చడాన్ని నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో టిడిపి అధినేత చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోవిందు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారికి అమరావతిలో ఇంటి స్థలం ఇవ్వడం చంద్రబాబుకు ఏమాత్రం ఇష్టం లేదన్నారు. ఇష్టం లేకపోగా దళితులు, బీసీలను అవమానపరిచే విధంగా మాట్లాడటం బాధాకరమన్నారు. వైసిపి మండల కన్వీనర్ మంజునాథ మాట్లాడుతూ సిఆర్‌డిఎ పరిధిలో ఉన్న పేదలు, అణగారిన వర్గాలకు చెందిన 51 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తే సెంటు స్థలంలో సమాధి కట్టుకోవాలా.. అని వ్యంగంగా మాట్లాడటం ఉందన్నారు. చంద్రబాబు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి చిత్ర శేఖరప్ప, వైసిపి కార్యకర్తలు రాఘవేంద్ర, బేలోడు, రామాంజనేయులు, హనుమంతు, పెద్ద కిష్టప్ప, వన్నూరుస్వామి, గలగల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైసిపి నాయకులు

బాధితులను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

ఎస్పీ గ్రీవెన్స్‌కు 9 వినతులు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు 9 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ కె.శ్రీనివాసరావు ప్రతి బాధితుడితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నరు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, ఎస్పీ సీసీ ఆంజనేయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన అరటి పిలకలనే నాటాలి

ఉద్యానవన అధికారిణి శైలజ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులు నాణ్యమైన అరటి పిలకలనే నాటాలని ఉద్యానవన శాఖ అధికారిణి శైలజ సూచించారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలోని రైతు సుబ్రమణ్యం నాటిన అరటి తోటను సందర్శించారు. ఇందులో భాగంగా వాతావరణంలో ఏర్పడిన వ్యత్యాసం వల్ల కొత్తగా నాటిన అరటి తోటలకు బ్యాక్టీరియా సోకిందన్నారు. నాణ్యమైన అరటి పిలకలు, దిగుబడి ఇచ్చే టిష్యూ కల్చర్ మొక్కలను ఎంపిక చేసుకుంటే బ్యాక్టీరియాను నివారించవచ్చన్నారు. అలాగే తప్పనిసరిగా మొదటి దుక్కిలో పశువుల ఎరువు, ఎస్ఎస్‌పి వేప పిండి, ట్రైకోడెర్మా ఎరువులను వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది నదియ, రైతులు జయరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, అశ్వర్థరెడ్డి, కుళ్లాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారిణి శైలజ

నేరాలు ఘోరాలు

ఆటోను ఢీకొన్న ఐచర్ - వ్యక్తి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

మృతిచెందిన బాలన్న

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని ఇగుడూరు గ్రామం వద్ద ప్రయాణికులను ఎక్కించుకునేందుకు తాడిపత్రి - గుత్తి జాతీయ రహదారిపై వెళ్తున్న ఆటోను ఐచర్ లారీ ఢీకొన్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పెద్దపప్పూరు మండలం నరసాపురం గ్రామానికి చెందిన బాలన్న (55) తన ఆటోలో నరసాపురం నుంచి తాడిపత్రి వరకు ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకుని వస్తున్నాడు. అయితే ఇగుడూరు గ్రామ సమీపంలో తాడిపత్రి - గుత్తి ప్రధాన రహదారిపై ఆటో నెమ్మదిగా వస్తున్న క్రమంలో అదే మార్గంలో వెనుకనే వేగంగా వచ్చిన ఐచర్ లారీ ప్రమాదవశాత్తు ఆటోను ఢీకొంది. దీంతో ఆటో సుమారు 10 అడుగుల మేర బోల్తా కొట్టుకుంటూ వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటోలో ముందు వైపు ఉన్న డ్రైవర్ బాలన్న అక్కడికక్కడే మతి చెందాడు. ఆయనతో పాటు ఉన్న ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో తాడిపత్రి ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు : మండలంలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ యోగానందరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ.కొండాపురం, సూరేపల్లి, చెర్లోపల్లి, పుట్లూరు, ఎస్.గూడూరులో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆయా సచివాలయ పరిధిలో అర్హులైన అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ వెంకటేశులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కన్నేపల్లి రోడ్డు సచివాలయంలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉండి టెన్త్ పాసై 35 సంవత్సరాల వయస్సులోపు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరసింహులు

బుక్కరాయసముద్రం : సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా దండువారిపల్లి రైతు భరోసా కేంద్రం సచివాలయ అధికారి డి.నరసింహులును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి ఉద్యోగులు నామీద నమ్మకంతో ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

జనసేనలో పలువురు చేరిక

అనంతపురం : జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ సిద్ధాంతాలు ఆశయాలకు ఆకర్షితులై పలువురు జనసేన పార్టీలో చేరారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని స్వగృహంలో పార్టీలో చేరిన వారికి జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీలో ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం ఉంటుందన్నారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ బాటలో పయనించి ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట పట్టాలన్నారు. పార్టీలో చేరిన వారిలో రామాంజనేయులు, సాయిదేవ్, జయవర్ధన్, వంశీ, యోగి, షెక్షావలి, బాలాజీ రాజ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, రాప్తాడు ఇన్‌ఛార్జి పవన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా సహాయ కార్యదర్శి అవుకు విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం గ్రామ సమీపంలో అదనపు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి విప్ కాపు రామచంద్రారెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే రాయదుర్గం పట్టణానికి విద్యుత్ కష్టాలు తీరుతాయన్నారు.

జెఎన్‌టియు ఎం.టెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన ఎంటెక్ 1వ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎం.టెక్ 1వ సెమిస్టర్ (ఆర్17), ఎం.టెక్ రెండవ సెమిస్టర్ (ఆర్21), (ఆర్17) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్షా ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని కోరారు.

వివాహానికి ఆర్థికసాయం

శింగనమల : మండల కేంద్రానికి చెందిన బెస్త పద్మావతి, నాగభూషణం కుమార్తె పావని వివాహానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు శుక్రవారం రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థికసాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, కాయల సురేష్‌యాదవ్, వాణిజ్య విభాగం పార్లమెంట్ కార్యదర్శి డేరంగుల శంకరయ్య, రంగస్వామి, దండు ప్రకాష్, బాబావలి, సోము, తదితరులు పాల్గొన్నారు.

విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఆత్మకూరు : మండలంలో విత్తన వేరుశన కాయలు అవసరమైన రైతులు ఆయా ఆర్‌బికె కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఒ వెంకటేశ్వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఖరీఫ్ సాగుకు 2023-24కి సంబంధించి కె.6రకం వేరుశెనగ దాదాపు 1292.4 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు.

మందకృష్ణకు మంత్రి పెద్దిరెడ్డి క్షమాపణ చెప్పాలి

శింగనమల : ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ తెలంగాణ నాయకుడు అని, ఆంధ్రాలోకి ఎలా వస్తాడనిమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దుర్భాషలాడటం బాధాకరమన్నారు. వెంటనే పెద్దిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిన్న జలాలపురం ఓబులేసు, నార్పల పుల్లప్ప, బండారు కదిరప్ప, బుక్కరాయసంద్రం బండారు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్.పల్లి ప్రాంతంలో బోరు ద్వారా నీరు సరఫరా అవుతున్న లైన్ నుంచి వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఎస్ పల్లి సమీపంలోని ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యల్లో భాగంగా వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ జి.శ్రీనివాసులు తెలిపారు. త్వరలో వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ డిఇ ఇంతియాజ్, ఎఇ శరత్ చంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ప్రజలకు వివరిద్దాం

వాలంటీర్ల సేవలు అభినందనీయం - మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్రంలో వాలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని మంత్రి ఉషశ్రీచరణ్ కొనియాడారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ముఖ్యంగా వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందజేయడంతోపాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా వాలంటీర్లు పని చేస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. రాబోవు రోజుల్లో కూడా జనన్న ప్రవేశపెట్టే పథకాలు అర్హులకు అందాలంటే మరోసారి జగన్‌ను దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వివిధ మండలాల అధికారులు, నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని 8వ సచివాలయంలో శుక్రవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ గౌని లావణ్య మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో పథకాల అమలు చేయడంలో వాలంటీర్ల పాత్ర చాలా కీలకమన్నారు. వాలంటీర్లు ప్రభుత్వానికి గుండెలాగా పని చేస్తున్నారన్నారు. బండి అజయ్, భీమనపల్లి దివాకర్, శ్రీనివాస్‌రెడ్డి, వార్డ్ ఇన్‌ఛార్జి గౌని శ్రీరామిరెడ్డి, వార్డు కన్వీనర్ సత్యనారాయణ, సచివాలయం అడ్మిన్ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

అనంతపురం : సిఎం జగన్ నాయకత్వంలోని ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమాన్ని ప్రతి ఒక్కరికీ వివరిద్దామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి దేశ చరిత్రలోనే సరికొత్త విప్లవాన్ని సృష్టించారన్నారు. అంతేగాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం అమలు చేశామన్నారు. అయితే అక్కడక్కడా ఉన్న చిన్న చిన్న సమస్యలను కొందరు భూతద్దంలో చూపిస్తూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వీటిని సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. 14 ఏళ్లు సీఎంగా పని చేశానని గొప్పలు చెప్పుకుంటున్న టిడిపి అధినేత చంద్రబాబు వాలంటీర్ వ్యవస్థపై అసత్య ప్రచారం చేయడం బాధాకరమన్నారు. కోవిడ్, వరదల వంటి విపత్కర పరిస్థితుల్లో వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రాణాలకు తెగించి పని చేశారన్నారు. అలాంటి వారి పట్ల కుట్రలు చేయడం మంచిది కాదన్నారు. కావున రానున్న రోజుల్లో కూడా సిఎం జగన్‌కు ఆదరించి మరింత అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు రాజేశ్వరి, శాంతిసుధ, శేఖర్‌బాబు, నగరపాలక సంస్థ సెక్రటరీ సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు చంద్రలేఖ, జయలలిత, రహంతుల్లా, ఇసాక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

వలంటీర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి ఉషాశ్రీచరణ్

ఉరవకొండ : రాష్ట్రంలో సిఎం జగన్ తీసుకొచ్చిన వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి అన్నారు. శుక్రవారం వజ్రకరూరు మండల కేంద్రంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఎలాంటి మధ్యవర్తులు లేకుండా సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజలకు అందుతున్నాయన్నారు. ముఖ్యంగా తాము గడప గడపకూ వెళ్లినప్పుడు వాలంటీర్లు అందిస్తున్న సేవల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-శింగనమల

మండల బెస్త సేవాసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌లో 10వ తరగతిలో అధిక మార్కులు సాధించిన బెస్త విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడంతోపాటు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరై 519 మార్కులు సాధించిన శింగనమలకుచెందిన బెస్త నాగవేణి, ఆంజనేయులు కుమార్తె స్ఫూర్తికి అవార్డుతోపాటు జ్ఞాపిక, నగదు బహుమతిని అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమణ, బెస్త సేవాసంఘం ప్రతినిధులు,విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

మహానాడుకు తెలుగుతమ్ముళ్లు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఈనెల 27, 28వ తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి శుక్రవారం కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి మూడు బస్సుల్లో తెలుగు తమ్ముళ్లబయలుదేరారు. ఇందులో భాగంగా స్థానిక మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి క్యాంపు కార్యాలయంలో యువనేత ఉన్నం మారుతీచౌదరి, నాయకులు ఉదయ్‌భాస్కర్ చౌదరి, తదితర నాయకులు జెండాఊపి బస్సును సాగనంపారు.

గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గర్భిణులు తప్పకుండా నెలవారి వైద్యపరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ స్వాతిలక్ష్మి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్లినిక్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా 39 మంది గర్భిణులకు రక్త పరీక్షలు, బీపీ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి స్కానింగులకు పంపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు ఐరన్, పోలిక్ యాసిడ్, క్యాల్షియం టాబ్లెట్లను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. హైరిస్క్ గర్భిణులకు గుర్తించి ప్రత్యేక సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఇకపోతే వర్షాలు పడుతున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన వారికి నరసింహపల్లి గ్రామానికి చెందిన చిప్పల ఈరప్ప, లక్ష్మీదేవి జ్ఞాపకార్థం కుమారులు, కోడళ్లు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న చిప్పల ఈరప్ప కుటుంబ సభ్యులు

విత్తనకాయల పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన విత్తన వేరుశనగ కాయలను విడపనకల్ మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 29వ తేదీ నుంచి సబ్సిడీ విత్తన కాయలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మండల పరిధిలోని చీకులగురికి 50 (క్వింటాళ్లలో), ఉండబండ 50, పాల్తూరు 90 క్వింటాళ్ల చొప్పున 190 క్వింటాళ్లు రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ ముత్యాలు, రైతులు సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

దర్గాహొన్నూరులో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గం : బొమ్మనహాల్ మండలం దర్గాహొన్నూరు గ్రామంలో శుక్రవారం రెండవ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో బాగంగా విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పథకాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా కాపు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. కావున మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

గార్లదిన్నె : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి శాంతి ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహం కారణంగా ఆడపిల్లలకు ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అంతేగాకుండా మాతా, శిశు మరణాలు పెరుగుతాయన్నారు. బాల్య వివాహాలు చేసిన వారికి రూ.లక్ష జరిమానాతో సంవత్సరం జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ తేజోష్ణ, ఎంఇఒ తారా చంద్రానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల తనిఖీ

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఒపి విభాగంలో ల్యాబ్, ఫార్మసీ, డెలివరీ గదిని పరిశీలించారు. అలాగే క్షేత్ర స్థాయిలో అసంక్రమిత వ్యాధుల సర్వే, ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.